బీఆర్‌ఎస్‌తో అన్ని వర్గాలకు మేలు


శామీర్‌పేట్‌లో ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్‌లో ప్రజాఆశీర్వాద సభలో మల్లారెడ్డి

మేడ్చల్ జోన్ బృందం: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారని మరోమారు బీఆర్‌ఎస్ గెలుపొంది హ్యాట్రిక్ సాధించడం ఖాయమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శామీర్‌పేట్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా బీఆర్‌ఎస్ పాలన సాగిందని, ప్రజలంతా మరోమారు బీఆర్‌ఎస్ రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. తాను మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఏడాది పాటు స్థానిక సంస్థల ఎన్నికల వల్ల కోడ్ ఉండగా మరో రెండేళ్ల కరోనా వల్ల కాలం వృథాగా గడిచిపోయిందని, మిగిలిన ఏడాదిన్నర కాలంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. తన సొంత నిధులతో సీసీ రోడ్లు, ఆలయాలు, కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేయించి ప్రజలు సేవలందించానని తెలిపారు. మరోమారు తనకు ప్రజలు అవకాశం కల్పించాలని మరింత సేవలు అందిస్తానని తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

నియోజకవర్గంలోని శామీర్‌పేట్, మూడుచింతలపల్లి, కీసర మండలాల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ఇతర పార్టీల నాయకులు బుధవారం మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

ఇంటింటి ప్రచారం..

బీఆర్‌ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డిని గెలిపించాలని ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో మంత్రి తనయుడు, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య, నాయకులు ప్రచారం చేశారు. జవహర్‌నగర్‌లో మేయర్ మేకల కావ్య, పార్టీ శ్రేణులు, మేడ్చల్‌లో మంత్రి సోదరుడు గోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు దయానంద్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో పార్టీ శ్రేణులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.


ఘట్‌కేసర్‌లో ప్రచారం చేస్తున్న మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి, చైర్ పర్సన్ పావనీజంగయ్య


జవహర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారంలో మేయర్ మేకల కావ్య

బీఆర్‌ఎస్ పాలనలో అంతా అవినీతే..


బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మేడ్చల్ జోన్ బృందం: బీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో అవినీతి మాత్రమే పెరిగిందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్‌యాదవ్ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మండలంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారులకు సరైన గౌరవం ఇవ్వకుండా సీఎం కేసీఆర్ అవమాన పరుస్తున్నారని మండిపడ్డారు. అమరులైన కుటుంబాలను గాలికి వదిలేసి, కేసీఆర్ కుటుంబ సభ్యులు పదవులు అనుభవిస్తున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామన్నారు. మల్లారెడ్డి కబ్జాలు, కమీషన్లతో కోట్ల రూపాయలు దండుకుంటున్నాడని విమర్శలు చేశారు. మూడుచింతలపల్లి వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బండి జగన్నాథం, లక్ష్మారెడ్డి, విష్ణుగౌడ్, లక్ష్మాపూర్ ఉపసర్పంచ్ వైద్యనాథ్, లక్ష్మణ్ పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి కోసం నామినేషన్ ఉపసంహరణ

ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన బీఆర్‌ఎస్ నాయకుడు మున్సిపాలిటీకి చెందిన మేకల దాసు, సీనియర్ నేత రాంమోహన్ బుధవారం రాజీనామా చేశారు. అనంతరం మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ మద్దతుగా మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఓటర్లంతా కాంగ్రెస్‌వైపే..

ఓటర్లంతా కాంగ్రెస్‌వైపే ఉన్నారని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం అంకిరెడ్డిపల్లికి చెందిన ఉప సర్పంచ్ కొల్కూరి మహేష్‌తోపాటు, పలువురు వార్డు సభ్యులు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌తో పాటు మంత్రి మల్లారెడ్డికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ గెలుపు ఖాయమన్నారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు కీసర మండలంలోని వివిధ గ్రామాల్లో, నాగారంలో కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో కౌన్సిలర్ గోగుల సరితావెంకటేష్, ప్రసాద్‌గౌడ్, సామల శ్రీనివాస్‌రెడ్డి, సోమేష్ పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న అంకిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ తదితరులు


మేకల దాసును పార్టీలోకి ఆహ్వానిస్తున్న వజ్రేష్‌యాదవ్

5 అసెంబ్లీ స్థానాలు.. పోటీలో 126 మంది

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- ఉపసంహరించుకున్న అభ్యర్థులు 64 మంది

సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికల్లో భాగంగా మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ బుధవారం ప్రశాంతంగా ముగియడంతో ఇక ఎన్నికల ప్రచార పర్వం మరింత వేడెక్కనుంది. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని జోరుగా నిర్వహిస్తుండగా, గురువారం నుంచి ఊపందుకోనుంది. జిల్లాలోని ఐదు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి 64 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా, 126 మంది ఎన్నికల బరిలో తలపడుతున్నారు.

- మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 67 అభ్యర్థుల్లో 45 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా 22 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు.
- మల్కాజిగిరిలో 41 మంది అభ్యర్థుల్లో 8 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా, 33 మంది అభ్యర్థులు మిగిలారు.
- కుత్బుల్లాపూర్‌లో 22 మంది అభ్యర్థుల్లో ఏడుగురు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా, 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.
- కూకట్‌పల్లిలో 26 మంది అభ్యర్థుల్లో ఇద్దరు నామినేషన్లను ఉపసంహరించుకోగా, 24 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు.
- ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 34 మంది అభ్యర్థుల్లో ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా, 32 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో ఉన్నారు.

నేడు మేడ్చల్‌లో రేవంత్‌రెడ్డి ప్రచారం

మేడ్చల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలో నిర్వహించే ప్రచారంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొంటారని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ తెలిపారు. గురువారం ఉదయం మేడ్చల్‌లో 1 గంటకు, మధ్యాహ్నం 1గంటకు జవహర్‌నగర్‌లో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లలో ఆయన పాల్గొంటారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నియామకం


కాంగ్రెస్ బీసీసెల్ కీసర మండల అధ్యక్షుడిగా రమేష్‌ముదిరాజ్

కీసర: కీసర మండల కాంగ్రెస్ కమిటీ బీసీ సెల్ అధ్యక్షుడిగా కీసర గ్రామానికి చెందిన చిక్కుడు రమేష్‌ముదిరాజ్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం మేడ్చల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్‌యాదవ్ చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో కీసర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను స్వీకరించనున్న ఎన్నికల పరిశీలకులు

ఫోన్ల ద్వారా... నేరుగా ఫిర్యాదుల స్వీకరణకు సిద్ధం

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నియమితులైన ఎన్నికల సాధారణ పరిశీలకులు, వ్యయపరిశీలకులు, జిల్లా పోలీస్ అబ్జర్వర్లకు ఎన్నికల ప్రవర్తన, నియమావళి ఉల్లంఘనలపై ప్రజలు, పార్టీల ప్రతినిధులు ఫోన్ నంబర్ల ద్వారా గానీ లేదా నేరుగా కలిసి ఫిర్యాదు చేసేందుకు జిల్లా ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. పరిశీలకుల ఫోన్ నంబర్లు, అందుబాటులో ఉండే సమయాలు ఈ విధంగా ఉంది.

ఎన్నికల పరిశీలకులు నేరుగా కలిసే సమయం ఇదే..

- మేడ్చల్ నియోజకవర్గానికి సంబంధించి ఎస్.కె. జైన్‌ను కీసరలోని మేడ్చల్ రిటర్నింగ్ ఆఫీసులో ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు..
- ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాలకు సంబంధించి పూర్వా గార్గ్‌ను కలెక్టరేట్లోని మొదటి అంతస్తులో ఎఫ్- 26లో ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు..
- కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లికి సంబంధించి అమన్మిట్టల్‌ను ప్రగతినగర్‌లోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్‌లో ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు..
- వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాశ్ మీనాను కలెక్టరేట్లోని మొదటి అంతస్తులోని ఎఫ్–26లో ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు..
- వ్యయ పరిశీలకులు బాలాసాహెబ్ బాపూరావును ప్రగతినగర్‌లోని ఇండియన్ నేషన్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్‌లో ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు..
- జిల్లా పోలీస్ అబ్జర్వర్ నేహా యాదవ్ కలెక్టరేట్లోని ఎఫ్–26లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు అందుబాటులో ఉంటారు.

సాధారణ అబ్జర్వర్లు...		
మేడ్చల్	ఎస్.కె.జైన్	73370 47775
మల్కాజిగిరి, ఉప్పల్	పూర్వా గార్గ్	73370 47776
కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి	అమన్మిట్టల్	73370 47778
వ్యయపరిశీలకులు...		
మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్	ప్రేమప్రకాశ్ మీనా	73370 47773
కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి	బాలాసాహెబ్ బాపూరావు.	73330 47774
జిల్లా పోలీస్ అబ్జర్వర్	నేహా యాదవ్	73372 09990

అరోరాలో 'ఆరంభం'

రామంతాపూర్: అరోరా పీజీ కళాశాలలో బుధవారం నూతన విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆరంభం–2023 పేరిట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ అరోరా పీజీ కళాశాల విద్యలోనే కాకుండా వివిధ నైపుణ్యాలను మెరుగు పర్చడంలో సహాయపడుతూ దిశా నిర్దేశం చేస్తుందన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులే తమ కళాశాలకు బ్రాండ్ అంబాసిడర్స్ అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంబీఏ, ఎంసీఏ విభాగాధిపతులు డాక్టర్ సీహెచ్ సతీష్ కుమార్, ఇ.దేవేందర్‌రావుతో పాటు ఉపాధ్యాయులు, నూతన విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం షాపుపై చర్యలు తీసుకోవాలి

మల్లాపూర్: నాచారం భవానీనగర్ ప్రధాన రహదారిపై ఉన్న మద్యం షాపుపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎల్లగొని ప్రేమ్‌రాజ్ గౌడ్ అన్నారు. బుధవారం నాచారంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం షాపు వల్ల తాగుబోతులతో నిత్యం మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 100 మీటర్ల లోపు దేవాలయం ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపు ఏర్పాటు చేసి చుట్టుపక్కన ఉన్న ప్రజలకు, మహిళలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిపారు. మద్యం షాపు నడపడానికి అక్కడ ఎవరికీ పర్మిషన్ ఇవ్వకూడదని అన్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

చేజారిపోకుండా..

- ద్వితీయ శ్రేణి నేతలపై అభ్యర్థుల దృష్టి
- గెలిస్తే.. అన్ని విధాలా ప్రాధాన్యతపై హామీ
- ఫోన్లలో మంతనాలు.. కదలికలపై కన్ను

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ద్వితీయ శ్రేణి నాయకులు చేజారిపోకుండా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తంటాలు పడుతున్నారు. ఇన్నాళ్లు సరైన ప్రాధాన్యం ఇవ్వకపోగా.. కనీసం ఫోన్ ఎత్తని పరిస్థితి.. అయితే అభ్యర్థులు ఇప్పుడు వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పట్టణ, గ్రామ, మండల స్థాయి ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు పార్టీ మారేందుకు సిద్ధం అవుతుండగా, వారిని కాపాడుకునే పనుల్లో అభ్యర్థులు నిమగ్నమవుతున్నారు.

- ఇప్పటికే బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌తో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే, కాంగ్రెస్‌లో కొందరు నేతలు కూడా ఇతర పార్టీల్లోకి చేరేందుకు ప్రయత్నిస్తుండగా, అభ్యర్థితో సహా పలువురు ముఖ్యనేతలు రంగప్రవేశం చేసి, అడ్డుకున్నట్లు తెలుస్తోంది. అలాగే, కాంగ్రెస్ నుంచి పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. మరి కొందరు కూడా చేరేందుకు ప్రయత్నించగా, నయానో, భయానో నిలువరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే పరిస్థితి బీజేపీలో కూడా కనిపిస్తోంది.
- మేడ్చల్ నుంచి అసెంబ్లీ టికెట్ ఆశించిన రూరల్ పార్టీ అధ్యక్షుడు విక్రంరెడ్డి బీజేపీని వీడనున్నట్లు ప్రచారం జరగడంతో.. రాష్ట్ర నేతలు నిలువరించే ప్రయత్నంలో భాగంగా మంతనాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ విక్రంరెడ్డి బీజేపీ రెబల్ అభ్యర్థిగా మేడ్చల్ అసెంబ్లీ నియోజవర్గంలో నామినేషన్ దాఖలు చేశారు. ఇదే పరిస్థితి కూకట్‌పల్లి బీజేపీలో కూడా కనిపిస్తోంది. అలాగే, ఉప్పల్, కూకట్‌పల్లి కాంగ్రెస్‌లో కూడా అలకలు కనిపిస్తున్నాయి.
- మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, మేడ్చల్ బీఆర్‌ఎస్‌లో ద్వితీయ శ్రేణి నాయకులు చేజారకుండా.. నియోజకవర్గం నేతలతో పాటు రాష్ట్ర నాయకులు రంగప్రవేశం చేసి, బుజ్జగింపుల పర్వానికి తెరలేపారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలో గెలిపిస్తే అన్ని విధాలుగా ప్రాధాన్యం ఉంటుందని హామీలు ఇస్తున్నారు. ఇప్పటికే కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీలు మారినప్పటికీ, ఇంకా అసంతృప్తిలో ఉన్న వారిని కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాలు, బస్తీలు, పట్టణంలో ప్రజల్లో బలమున్న నాయకులపై ఓ కన్నేసి ఉంచుతున్నారు. అవసరం అనుకుంటే అభ్యర్థుల అనుచరులతో ఫోన్లో మాట్లాడిస్తున్నారు. తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని సముదాయిస్తున్నారు.

నామినేషన్ విత్ డ్రా చేసుకున్న విక్రంరెడ్డి



మేడ్చల్: మేడ్చల్ బీజేపీ టికెట్ ఆశించి భంగపడ్డ బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి రెబల్‌గా నామినషన్ దాఖలు చేసి చివరకు విత్‌డ్రా చేసుకున్నారు. మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ టికెట్ ఆశించి దాదాపుగా ఖరారై చివరి నిమిషంలో ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డికి ఇవ్వడంతో ఆగ్రహం చెందిన విక్రమ్‌రెడ్డి రెబల్‌గా నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బుజ్జగించడంతో ఆయన తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో బీజేపీకి రెబల్ దెబ్బ తప్పింది.

మేడ్చల్‌లో బీజేపీ బైక్ ర్యాలీ



మేడ్చల్: ప్రచారంలో భాగంగా బీజేపీ నాయకులు అభ్యర్థి సుదర్శన్‌రెడ్డితో కలిసి పట్టణంలోని వివిధ కాలనీల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. వివిధ వార్డుల్లో నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి బీజేపీకి ఓటు వేయాలని కోరారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి


శేఖర్‌రెడ్డి(ఫైల్)

శామీర్‌పేట్: ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడటంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామానికి చెందిన వీరన్నగారి బాబు, శామీర్‌పేట మండలం యాదారం గ్రామానికి చెందిన శేఖర్ రెడ్డి ద్విచక్రవాహనంపై శామీర్‌పేట నుంచి తుర్కపల్లి వైపు రాజీవ్ రహదారిపై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఫారెస్ట్ గెస్ట్‌హౌజ్ సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి వీరిద్దరూ కింద పడ్డారు. బైక్ వెనకాల కూర్చున్న శేఖర్‌రెడ్డి తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతిచెందగా, బాబుకు గాయాలయ్యాయి. ఈ మేరకు జీనోమ్‌వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు స్థానాల్లో ఆధిపత్యం అతడిదే..

మేడ్చల్ జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల ఓట్లే అధికం

- తుది ఓటరు జాబితాలో మొత్తం ఓటర్లు **28.19** లక్షలు
- పురుష ఓటర్లు **14.59** లక్షలు, మహిళా ఓటర్లు **13.59** లక్షలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లోనూ పురుషుల ఓట్లే అధికంగా ఉన్నాయి. అక్టోబరు 4న వెలువరించిన తుది జాబితా ప్రకారం మల్కాజిగిరి మినహా నాలుగు నియోజకవర్గాల్లో మహిళా ఓట్లు అధికంగా ఉండగా.. చివరి ఓటరు జాబితాలో అయితే.. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషులదే పైచెయ్యి అయ్యింది. దీంతో అభ్యర్థుల గెలుపోటముల్లో పురుషుల ఓట్లే కీలకం కానున్నాయి. ఈ నెల 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్ల చివరి జాబితాను ఎన్నికల సంఘం ఈ నెల11న(శనివారం) ప్రకటించింది. అక్టోబరు 4న తుది ఓటరు జాబితాను వెలువరించగా, అదే నెల 5 నుంచి 31 వరకు కొత్తగా ఓటు హక్కు పొందడానికి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

కొత్త ఓటర్లు 1,27,100 మంది

- అక్టోబరు 4న ప్రకటించిన జాబితా ప్రకారం ఐదు అసెంబ్లీ స్థానాల్లో 26,91,167 మంది ఓటర్లు ఉన్నారు. చివరి జాబితా ఆధారంగా 28,19,067 మంది అయ్యారు. మొత్తంగా 1,27,100 మంది నూతన ఓటర్లు పెరిగారు.
- జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో పురుష ఓటర్లు 14,59,629, మహిళా ఓటర్లు 13,59,057 మంది ఉన్నారు. అంటే 1,00572 మంది పురుషులు ఎక్కువగా ఉన్నారు.
- మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 18,654 మంది, కుత్బుల్లాపూర్‌లో 34,437 మంది, కూకట్‌పల్లిలో 21,916, ఉప్పల్‌లో 21,076, మల్కాజిగిరిలో 4,489 మంది పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు.
- అక్టోబరు 4 జాబితా ప్రకారం ఐదు నియోజకవర్గాల్లో 361 మంది థర్డ్ జెండర్ ఓటర్లు న్నారు. తాజాగా వారి సంఖ్య 381గా నమోదైంది. అంటే 20 మంది ఓటర్లు పెరిగారు. ఐదు నియోజకవర్గాల్లో కూడా థర్డ్ జెండర్ ఓటర్లు పెరిగారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
మేడ్చల్	3,28,222	3,09,568	48	6,37,838
మల్కాజిగిరి	2,46,731	2,42,242	11	4,88,984
కుత్బుల్లాపూర్	3,66,660	3,32,223	159	6,99,042
కూకట్‌పల్లి	2,42,800	2,20,884	123	4,63,807
ఉప్పల్	2,75,216	2,54,140	40	5,29,396
మొత్తం	14,59,629	13,59,057	381	28,19,067

విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి


ఓరియెంటేషన్ డేలో విద్యార్థులు, అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు భవిష్యత్‌లో వ్యాపారవేత్తలుగా ఎదగాలని సెలరోట్ సిస్టమ్స్ సీఈఓ సృజన, ఎస్‌ఆర్‌ఈసీ కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎస్‌ఆర్‌ఈసీ కళాశాలలో బుధవారం ఎంబీఏ విద్యార్థుల ఓరియెంటేషన డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సాంకేతికత అందిపుచ్చుకుని తమలోని నైపుణ్యాలను వెలికితీసి మంచి గుర్తింపు సాధించాలన్నారు. విద్యార్థి దశలో కష్టపడితేనే భవిష్యత్తులో ఆనందంగా గడపవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహరెడ్డి, ప్రిన్సిపల్ లోకనాథం, ప్రమోద హోలీ స్టార్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



బోడుప్పల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బుధవారం ఆయన సర్టిఫికేట్లు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు ఆరోగ్యవంతమైన జీవితానికి ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను కేవలం చదువులకే పరిమితం చేయకుండా వారికి ప్రతిభ ఉన్న రంగాల్లో రాణించే విధంగా శిక్షణ ఇప్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను కూడా అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.